# సత్యవాక్యము

# THE WORD OF TRUTH

## క్రైస్తవ తెలుగు మాసపత్రిక

FEBRUARY - 2004

## ఆత్మీయ సందేశములు సమర్పించువారు

TEJA TV

# సత్యవాణి

## టి.వి. కార్యక్రమములను

MAA TV

ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు

**మా టీ.వి.**లోను

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు

**తేజ ఛానల్** లోను చూడండి.

ప్రసంగీకులు : Bro. **జాషువా గూటం**

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు విన్పించండి !!!

సత్యవాక్కు
THE WORD OF TRUTH
P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722
Editor :
Joshua Gootam

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటిక 24 — ఫిబ్రవరి 2004 — సంచిక 7

# క్రైస్తవులు - పాత నిబంధన - 1

(Christians and Old Testament)

నేటి మానవుల యెడల దేవుని చిత్తము బైబిలు నందలి ప్రతి పేజిలోను వ్రాయబడి యున్నదని అనేకులు తలంచె దరు. అట్లయిన నిజానికి సత్యవాక్యమును సరిగ విభజింపవలసిన పనే లేకపోవును. బైబిలు గ్రంథము యధార్థముగా దేవుని వాక్యమైయున్నది. అయితే అందు వ్రాయ బడినవన్నియు అన్ని వేళలందున్న మానవు లకు వర్తించవు. బైబిలు సూచించు చున్న మూడు వివిధ యుగములను గూర్చి ఇదివరకే తెలిసికొనియుంటిమి. యేసు క్రీస్తు పాతనిబంధనను సిలువకు మేకు లతో కొట్టుటద్వారా దానిని నెరవేర్చెనని తెలుసుకొంటిమి. అయితే ఆయన ఇచ్చిన క్రొత్త నిబంధన సూత్రములను తెలుసు కొనకముందు పాత నిబంధన ఏమైనను ఈనాడు అమలులో యున్నదో లేదో గమ నించుట మంచిది.

పాత నిబంధనకు క్రొత్త నిబంధన కేవలము కలుపబడి యున్నదని, అందు వలన క్రైస్తవులు నేడు పాత క్రొత్త నిబంధనల ప్రకారము నడచుకొనవలెనని సహృదయు లైన అనేకులు భావించుచూ యుం టారు. కాని ఈ రెండు నిబంధనలు వేర్వేరు సంగ

తులను ఆజ్ఞాపించుటచే గొప్ప గందరగోళము సులభముగా వచ్చును. అయితే ఇశ్రాయేలీయులకు మాత్రమే దేవుడు మోషే ద్వారా ధర్మశాస్త్రము నిచ్చెననియు, క్రైస్తవులు దానికంటె భిన్నమైన క్రొత్త నిబంధన ప్రకారము సంపూర్తిగా నడచుకొనవలెననియు గ్రహించుసరికి నేటి క్రైస్తవ లోకములో యున్న గందరగోళము ఇట్టే మాయమై పోవును.

లూకా వ్రాసిన సువార్త 5:36-39లో క్రొత్త నిబంధన యొక్క ప్రాథమిక సూత్రముల నిట్లు యేసు బోధించెను: "ఎవడును పాతబట్టకు క్రొత్త గుడ్డ మాసిక వేయడు; వేసిన యెడల క్రొత్తది దానిని చింపివేయును; అదియును గాక క్రొత్త దానిలో నుండి తీసిన ముక్క పాతదానితో కలియదు. ఎవడును పాత తిత్తులలో క్రొత్త ద్రాక్షారసము పోయడు; పోసిన యెడల క్రొత్త ద్రాక్షారసము తిత్తులను పిగుల్చును; రసము కారిపోవును, తిత్తులు పాడగును. అయితే క్రొత్త ద్రాక్షారసము క్రొత్త తిత్తులలో పోయవలెను. పాత ద్రాక్షారసము త్రాగిన వెంటనే క్రొత్త దానిని కోరువాడెవడును లేడు; పాతదే మంచిదనును".

యేసు చెప్పిన ఈ ఉపమానము పాత, క్రొత్త నిబంధనలను గూర్చి చెప్పెను. ఆ రెండు నిబంధనలు ఒకేసారి ఎవడును అనుసరించలేడని ఆయన బోధించెను. పరిగదా వాటిని వేర్వేరుగ నుంచవలెనని ఆయన ఇక్కడ బోధించెను. పాత ద్రాక్షారసమును త్రాగి దానికి అలవాటు పడినవాడు పాతదే మంచిదని ఎట్లనునో, అట్లే పాత నిబంధన ప్రకారము వందలకొలది సంవత్సరముల పాటు నడచుకొనిన యూదులు క్రొత్త నిబంధన అమలులోనికి రాగా పాతదే మంచిదనిరి. అందువలన నేటి కింకను యూదులు యూదులవలెనే యున్నారు.

రోమా 7:1-7లో సాధారణ వివాహ చట్టము నెత్తిచూపించుచు, క్రైస్తవునికి ధర్మశాస్త్రమునకు గల సంబంధమును అపో.పౌలు చక్కగా బోధించెను. అతడు ఇట్లు చెప్పెను: మనుష్యుడు బ్రతికినంతకాలమే ధర్మశాస్త్రమతనిమీద ప్రభుత్వము చేయుచున్నది. భర్త గల స్త్రీ భర్త బ్రతికియున్నంతవరకే ధర్మశాస్త్రమువలన అతనికి బద్ధురాలు గాని చనిపోయిన యెడల భర్త విషయమైన ధర్మశాస్త్రము నుండి విడుదల పొందును. భర్త బ్రతికి యుండగా ఆమె వేరొక పురుషుని చేరిన యెడల ఆమె వ్యభిచారిణి యనబడును గాని భర్త చనిపోయిన యెడల ఆమె ధర్మశాస్త్రము నుండి విడుదల పొందెను గనుక వేరొక పురుషుని వివాహము చేసికొనినను వ్యభిచారిణి కాకపోవును. అదేవిధముగ క్రైస్తవులు దేవుని కొరకు ఫలమును ఫలించునట్లు మృతులలో నుండి లేపబడిన క్రీస్తు అనువేరొకని చేరుటకై ఆయన

శరీరము ద్వారా వారు ధర్మశాస్త్రము విషయమై మృతులైరి. ఇప్పుడైతే ధర్మశాస్త్రము నుండి విడుదల పొందితిమి అని అతడు చెప్పెను. ఏ ధర్మశాస్త్రము నుండి? అని మనము అడిగిన యెడల, "ఆశింపవద్దని చెప్పిన ధర్మశాస్త్రము" అని 6వ వచనములో అతడు చెప్పుచున్నాడు. నిర్గమ 20:17ను చూచిన "నీ పొరుగు వానిది దేనిని ఆశించకూడదును" ఆజ్ఞ పది ఆజ్ఞలలో ఒకటై యున్నది. గనుక పది ఆజ్ఞలు గల ఆ ధర్మశాస్త్రమునకు మనము మృతుల మైతిమి యని రోమా 7:1-7 బోధించుచున్నది.

2 కొరింధి 3వ అధ్యాయములో కొరింధులోని క్రైస్తవులు రాతిపలక మీదగాని, సిరాతోగాని వ్రాయబడిన వారు కాక మెత్తని హృదయములు అను పలకమీద జీవము గల దేవుని ఆత్మతో పౌలు యొక్కయు, తిమోతియొక్కయు పరిచర్య మూలమున వ్రాయబడిన క్రీస్తు పత్రికయై యున్నారని అపొ.పౌలు చెప్పెను (3:3). కొరింధీయులు జీవము గల దేవుని ఆత్మతో వ్రాయబడినవారని చెప్పుటలో వారు రాతిపలకమీద వ్రాయబడిన ధర్మశాస్త్రము నుండి విడుదల పొందిరి యని గ్రహించవలెను. 17వ వచనములో "ప్రభువే ఆత్మ, ప్రభువు యొక్క ఆత్మ యెక్కడ నుండునో అక్కడ స్వాతంత్ర్యము నుండును" అని కన్పడుచున్నది. ఇశ్రాయేలీయులతో రాతిపలక ద్వారా దేవుడు నిబంధనను చేస్తే, క్రైస్తవులనయితే హృదయము అను పలకమీద వ్రాయబడిన వారిగ దేవుడు చేసెను.

6వ వచనములో చూచిన ఆయనే క్రొత్త నిబంధనకు మమ్మును పరిచారకులనుగా చేసెను అని పౌలు చెప్పుచున్నాడు. అక్షరమునకు కాదు గాని ఆత్మకే పరిచారకులుగా చేసెను. అక్షరము చంపును గాని, ఆత్మ జీవింపజేయును. రాళ్ళ మీద చెక్కబడిన అక్షరములు మరణ కారణమగు పరిచర్య అయినదై మహిమ కలిగియుంటే, నీతికి కారణమైన పరిచర్యయగు క్రొత్త నిబంధన అధికమైన మహిమ కలదాయెను. అత్యధికమైన మహిమ క్రొత్త నిబంధన కుండుటవలన మునుపు మహిమ గలదిగా చేయబడిన పాత నిబంధన ఇప్పుడు మహిమ లేనిదాయెను. అయితే మోషే ద్వారా వచ్చిన మహిమ తగ్గిపోయినదై ఎత్తివేయబడెను. అయినను పాతనిబంధన చదువబడునప్పుడు అది క్రీస్తునందు కొట్టివేయబడెనని ఇశ్రాయేలీయులకు తేటపరచబడక ఆ ముసుకే నిలిచియున్నది అని పౌలు ఈ అధ్యాయములో బోధించెను.

ఈ అంశమును మీరు విస్తులముగా

అర్థము చేసికొను నిమిత్తము 2 కొరింథి 3వ అధ్యాయమును దయచేసి చదువండి.

గలతీయులకు వ్రాసిన పత్రిక అంతటిలోను మోషే ధర్మశాస్త్రమునకు, క్రీస్తు ధర్మశాస్త్రమునకు గల వ్యత్యాసమును పౌలు వారికి బోధించెను. యేసుక్రీస్తు నందు క్రైస్తవులు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. (3:26). అయితే మోషే ధర్మశాస్త్రమును అనుసరించుచూ క్రైస్తవులుగా యుండువారు బలహీనమైనవియు, నిష్ప్రయోజనమైనట్టియు మూల పాఠములకు తొలగిపోయినవారు (4:9).

ధర్మశాస్త్రమునకు లోబడి యుండగోరువారలారా, మీరు ధర్మశాస్త్రమును వినుటలేదా? అబ్రాహాముకు దాసివలన ఒకడును, స్వతంత్రురాలి వలన ఒకడును ఇద్దరు కుమారులు కలిగిరని వ్రాయబడి యున్నది గదా. ఈ సంగతులు అలంకార రూపముగ చెప్పబడి యున్నవి. ఈ ఇద్దరు స్త్రీలు రెండు నిబంధనలై యున్నారు. వాటిలో ఒకటి సీనాయి కొండ సంబంధమై యున్నది. అది దాస్యములో ఉండుటకు పిల్లలను కనును. ఇది హాగరు. పౌలు గలతీయులకు వ్రాయుసరికి "యెరూషలేమువలె" యున్న యూదులను ఇది సూచించుచున్నది. అయితే పైనున్న యెరూషలేము స్వతంత్రముగా ఉన్నది. అది మనకు తల్లి. అయితే లేఖనమేమి చెప్పుచున్నది? దాసిని దాని కుమారుని వెళ్ళగొట్టుము, దాసి కుమారుడు స్వతంత్రురాలి కుమారునితో పాటు వారసుడై యుండడు. కాగా నా సహోదరులారా, మనము స్వతంత్రురాలి కుమారులమే గాని దాసి కుమారులము కాము. అనగా మనము క్రీస్తు ధర్మశాస్త్రము వలన జనింప జేయబడిన వారమే కాని మోషే ధర్మశాస్త్రము వలన కాదు అని గలతీ 4వ అధ్యాయము అంతటిలోను పౌలు విశదీకరించెను.

"క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసియున్నాడు గనుక మీరు స్థిరముగా నిలిచి మరల దాస్యమను కాడిక్రింద చిక్కుకొనకుడి" యని గలతి 5:1లో అతడు హెచ్చరించుచున్నాడు. అయితే "మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడువారెవరో వారు క్రీస్తులో నుండి బొత్తిగా వేరుచేబడి యున్నారు. కృపలో నుండి తొలగిపోయి ఉన్నారు" అని 4వ వచనములో అతడు చెప్పుచున్నాడు. యేసుక్రీస్తు నందు సున్నతి పొందుట యందేమియు లేదు. పొందకపోవుట యందేమియును లేదు గాని క్రొత్త సృష్టి పొందుటయే (6:15). యేసుక్రీస్తు సిలువయందు తప్ప మరి దేనియందైనా అతిశయించుటను పౌలు ఖండించెను.

ఎఫెసీ 2:11-19లో మనము చూచిన ధర్మశాస్త్రము వలన యూదులు కాని వారందరు పరదేశులుగాను, పరజనులు గను చేయబడిరనియు, అయితే యేసు క్రీస్తు యూదులను అన్యజనులను తన యందు నూతన పురుషునిగా సృష్టించి వారిని ఏక శరీరముగా చేసెననియు పౌలు నిరూపించెను. అట్లు చేయుటకు ముందు వారిని విడగొట్టిన మధ్య గోడయగు పాత నిబంధనను ఆయన పడగొట్టెను.

కొలస్స 2:14-17లో దేవుడు వ్రాత రూపకమైన మోషే ధర్మశాస్త్రము మీది చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసి మేకులతో సిలువకు కొట్టివేసెను అని పౌలు చెప్పెను. గనుక క్రైస్తవులు అన్నపాన విషయములలోనైనను, పండుగ అమావాస్య విశ్రాంతి దినము అను వాటి విషయములలోను తీర్పు తీర్చ నెవరికిని అవకాశ మీయరాదు. అనగా ఆయా దినములు, పండుగలతో వారికి సంబంధ ముండకూడదు. అవన్నియు పాతనిబంధన కాలములో యున్నపుడు రాబోవువాటి ఛాయయేగాని నిజ స్వరూపము క్రీస్తులో ఉన్నది.

యేసుక్రీస్తు మొదటిసారిగ వచ్చి వెళ్లెను. ఆయన మరల త్వరలో రాబోవుచున్నాడు. ధర్మశాస్త్ర విధులన్నియు, ఆజ్ఞలన్నియు, నియమములన్నియు ఆయన ఎత్తివేసి క్రొత్త నిబందనను మనకు ఇచ్చెను. ధర్మశాస్త్రము మోషే ద్వారా కలిగెను. కృపయు, సత్యమును క్రీస్తు ద్వారా కలిగెను. మనలను రక్షించునది క్రీస్తు వాక్యమే గాని మోషే ధర్మశాస్త్రము కాదు. యేసుక్రీస్తు సువార్తను నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనొల్లనివానికి శిక్ష విధింపబడును (మార్కు 16:16).

*- జాషువా గూటం*

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న **'సత్యవాణి'** టి.వి. కార్యక్రమములను ప్రతి **మంగళవారం** ఉదయం 6:30 గం॥లకు **మా టి.వి.** లోను మరియు ప్రతి **శనివారం** ఉదయం 6:30 గం॥లకు **తేజ** ఛానల్ లోను చూడండి.

ఉపమానమాలిక :

# తప్పిపోయి దొరికెను

## (Lost and Found)

**లూకా 15:1-10**

యేసు ప్రభువు బోధించు చుండగా సమస్తమైన సుంకరులు పాపులు ఆయన బోధవినడానికి వచ్చేవారు. పరిసయ్యులు శాస్త్రులు అది చూచి ఆయన పాపులను చేర్చుకొని వారితో కూడ భోజనము చేయు చున్నాడని చాల సణుగుకొన్నారు.

"అందు కాయన వారితో ఈ ఉప మానము చెప్పెను. మీలో ఏ మనుష్యుని కైనను నూరు గొర్రెలు కలిగి యుండగా వాటిలో ఒకటి తప్పిపోయిన యెడల అతడు తొంబది తొమ్మిదింటిని అడవిలో విడిచిపెట్టి, తప్పిపోయినది దొరకు వరకు దానిని వెదక వెళ్లడా? అది దొరకినప్పుడు సంతోషముతో దానిని తన భుజముల మీద వేసికొని యింటికివచ్చి తన స్నేహి తులను పొరుగు వారిని పిలిచి మీరు నాతో కూడ సంతోషించుడి; తప్పిపోయిన నాగొర్రె దొరకినదని వారితో చెప్పునుగదా. అటు వలె మారుమనస్సు అక్కరలేని తొంబది తొమ్మిది మంది నీతి మంతుల విషయమై కలుగు సంతోషము కంటె మారుమనస్సు పొందు ఒక్క పాపి విషయమై పరలోక మందు ఎక్కువ సంతోషము కలుగును" (లూకా 15:1-7).

మానవజాతి అంతయు నశించిపోవు చున్నది. అది దేవుని గృహము నుండి, సత్య నిధులలో నుండి, పరిశుద్ధ మార్గముల నుండి తొలగిపోయి నాశనమై పోవుచున్నది. అయితే నశించిపోవుచున్న మానవులను రక్షించడానికి యేసు ప్రభువు ఈ లోకమునకు వచ్చాడు. తగిన సమయములో సహాయం పొందలేక పోయినందున నాశనమైన వారనేకులున్నారు. యేసు ప్రభువు ఆత్మీయముగా నాశనమై పోవుచున్న వారిని వెదకి రక్షించడానికి ఈ లోకమునకు వచ్చారు.

సృష్టికర్తయైన దేవుని సహవాసము నుండి తొలగింపబడిన మానవుని దుస్థితిని దేవుడు ఎరిగి యున్నాడు. దేవుడు లేకుండా మానవుడు ఆత్మీయ అంధకారములో మునిగి యున్నాడు. అవిశ్వాసము వలన అతడు అంతకంతకు అధోగతికి పాలైపోవు చున్నాడు. అయితే ఈపాపపు లోకము నుండి మానవుని విమోచించుటకు దేవుడొక మార్గాన్ని ఏర్పాటు చేసాడు. అందువలన ఆయన తన అద్వితీయ కుమారుని ఈ లోకానికి పంపాడు.

యేసు క్రీస్తు ఈ లోకమునకు ఎందుకు వచ్చారో ఆయనే తన బోధ ద్వారాను క్రియల ద్వారాను మనకు అనేక రీతులుగ తెలియపరచారు. వంద గొర్రెలు కలిగి వాటిలో ఒక్కదానిని పోగొట్టుకొనిన గొర్రెల కాపరిని గూర్చి ఆయన మనకు బోధించారు. "మీలో ఏ మనుష్యునికైనను నూరు గొర్రెలు కలిగియుండగా వాటిలో ఒకటి తప్పిపోయిన యెడల అతడు తొంబది తొమ్మిదింటిని అడవిలో విడిచిపెట్టి తప్పి పోయినది దొరుకువరకు దానిని వెదక వెళ్లడా? అది దొరికినప్పుడు సంతోషముతో దానిరి తన భుజముల మీద వేసుకొని యింటికి వచ్చి తన స్నేహితులను పొరుగువారిని పిలిచి, మీరు నాతో కూడ సంతోషించుడి; తప్పిపోయిన నా గొర్రె దొరికినదని వారితో చెప్పును గదా. అటువలె మారుమనస్సు అక్కరలేని తొంబది తొమ్మిది నీతిమంతుల విషయమై కలుగు సంతోషము కంటె మారుమనస్సు పొందు ఒక్క పాపి విషయమై ఎక్కువ సంతోషము కలుగును" (లూకా 15:3-7).

ఆయన బోధించుచు మరియొక ఉపమానము చెప్పారు; "ఏ స్త్రీకైనను పది వెండి నాణెములుండగా వాటిలో ఒక నాణెము పోగొట్టుకుంటే ఆమె దీపము వెలిగించి యిల్లు ఊడ్చి అది దొరుకువరకు జాగ్రత్తగా వెదకదా? అది దొరికినప్పుడు తన చెలికత్తెలను పొరుగువారిని పిలిచి నాతో కూడ సంతోషించుడి, నేను పోగొట్టుకొనిన నాణెము దొరకినదని వారితో చెప్పునుగదా. అటువలో మారుమనస్సు పొందు ఒక పాపి విషయమై దేవుని దూతల ఎదుట సంతోషము కలుగునని మీతో చెప్పుచున్నానను" (లూకా 15:8-10).

వంద గొర్రెలలో తప్పిపోయిన ఒక్క గొర్రెను వెదుకుచు వెళ్లిన గొర్రెల కాపరి వలెను, పోగొట్టుకొనిన వెండి నాణెమున జాగ్రత్తగా వెదకిని స్త్రీ వలెను, పాపములో పడిపోయిన వారిని వెదకి రక్షించుటకు యేసు క్రీస్తు ఈ లోకానికి వచ్చాడు. తప్పిపోయిన గొర్రెను అడవిలో వెదకుచు వెళ్లిన గొర్రెలకాపరియొక్క ప్రేమ ఎంత గొప్పదో అట్లే పరలోకము నుండి మనలను వెదుకుచు వచ్చిన యేసు క్రీస్తు యొక్క ప్రేమ అంత గొప్పది. గొర్రె యొక్క క్షేమము నిమిత్తము ఆయన దానిని కనుగొను వరకు వెదకాడు. పోగొట్టుకొనిన వెండి నాణెమును ఒక స్త్రీ జాగ్రత్తగా వెదకుటలో, దేవుని యెదుట ప్రతి ఆత్మకు ఉన్న విలువ బహు గొప్పదియని అర్థమగుచున్నది. యేసు బోధించిన ఈ గొప్ప ఉపమానములో మన హృదయములను కరగించునంత ప్రేమ అందు కన్పడుచున్నది. మనలో ఏ ఒక్కడు నశించాలని ఆయన ఇష్టపడుట లేదు. ఆయన నీతిని బట్టి పాపములోబడి

నశించుచున్న మనలను వెదకి రక్షించ డానికి ఈ లోకానికి వచ్చారు.

యేసుక్రీస్తు పాపిని ప్రేమించి పాపాన్ని ద్వేషించారు. శాస్త్రులు పరిసయ్యులు ఆయన పాపుల యొద్ద బస చేయుటకు వెళ్లెనని సణుగుకొన్నారు. అందుకాయన, నేను పాపులను పిలువ వచ్చితినిగాని నీతిమంతులను పిలువ రాలేదు. రోగులకే గాని ఆరోగ్యముగలవారికి వైద్యుడక్కరలేదుగదా యని వారికి సమాధానమిచ్చారు (మత్త 9:10-13). నిజమే ఆత్మీయ వైద్యుడైన యేసుక్రీస్తు పాపపురోగము నుండి మనలను విడుదల చేయడానికి వచ్చారు. ఆయన గ్రుడ్డివారికి చూపు నిచ్చాడు, కుంటివారిని బాగుచేసాడు, చెవిటివారికి వినేశక్తి నిచ్చాడు, కుష్టు రోగులను స్వస్థపరచాడు. చనిపోయిన వారిని లేవదీసాడు, దయ్యములను వెళ్లగొట్టాడు, పాపములను క్షమించాడు. నిశ్చయముగా పాపులను వెదుకు వచ్చాడు.

చివరిగా,కాలము పరిపూర్ణమయినప్పుడు మనందరి పాప ప్రాయశ్చిత్తార్థ బలిగా తన్నుతాను సిలువ లో అర్పించుకొన్నారు. పాపములో బడి నశించుచున్న మనమాయనయందు రక్షింపబడ గల్గునట్లు మన నిమిత్తము ఆయన మరణించారు. మనము విమోచింప బడగల్గునట్లును మనలను నిత్యము ప్రేమించు చున్న దేవుని దొడ్డిలో తిరిగి చేర్చగల్గునట్లును ఆయన మన నిమిత్తము బలి అయ్యారు; మనలను ఇంకా వెదకుచునే యున్నాడు. తప్పిపోయిన వారలారా నా యొద్దకు రండి యని పిలుచుచున్నారు (మత్త 11:28). నీ హృదయపు తలుపు నొద్ద ఆయన నిలబడి తట్టుచున్నాడు. నీ హృదయము తెరచి ఆయనను లోపలికి ఆహ్వానించుము. యేసు క్రీస్తునందు విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది, ఆయన యందున్న విశ్వాసమును ఒప్పుకొని పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుట ద్వారా నీ హృదయములోనికి ఆయనను ఆహ్వానించగలవు (యోహాను 8:24; అపొ.కా. 2:38).

ఆయన వెదకుచున్న సమయంలో నీవాయనకు దొరికిన యెడల అది నీకు మేలు.

✍ - జాషువా గూటం.

# బాప్తిస్మము ఎందుకు పొందవలెను?

(Why be Baptized ?)

బాప్తిస్మము బైబిలు అంశమై యున్నది. క్రొత్త నిబంధన అంతటిలోను దానిని గూర్చి చెప్పబడి యున్నది; అది నీటి సమాధియని, నీటిలో ముంచబడుట యని నిర్వచింపబడినది (అపొ.కా. 8:36-39). అది తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మని యొక్కయు నామమున జరిగించబడవలెనని క్రీస్తు చెప్పెను. లేఖనములు దీనిని బోధించు చున్నను బాప్తిస్మము ప్రాముఖ్యము కాదని యు, రక్షణ నొందుటకు దాని అవుసరము లేదనియు చాలమంది నమ్ముదురు. ఈ అంశమును ఎత్తిన మరుక్షణములో అనేక ప్రశ్నలను వారు వేయుదురు. ఒకడు బాప్తిస్మము పొందవలెనా? అట్లయితే ఎందుకు పొందవలెను? అని అడుగు వారున్నారు. ఒకడు బాప్తిస్మము నెందుకు పొందవలెనో ఈ వ్యాసములో లేఖనము లలో నుండి జవాబు నిచ్చుటకు ప్రయత్న ము చేయుదము.

1. బాప్తిస్మమును ప్రభువే ఆజ్ఞా పించెను గనుక ఒకడు బాప్తిస్మము పొంద వలెను. సర్వలోకమునకు సువార్త ప్రకటిం చుడి యని క్రీస్తు తన శిష్యుల కాజ్ఞాపించి, "నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింప బడును; నమ్మని వానికి శిక్ష విధింప బడును" అని చెప్పెను (మార్కు 16:15,16). పేతురు కొర్నేలికి అతని యింటివారికి సువార్తను బోధించిన తరువాత వారు దేవునికి విధేయులగుటకు యిచ్ఛ కలిగి యున్నారని గ్రహించి, "మనవలె పరిశుద్ధా త్మను పొందిన వీరు బాప్తిస్మము పొంద కుండ ఎవడైనను నీళ్ళకు ఆటంకము చేయగలడా అని చెప్పి యేసుక్రీస్తు నామ మందు వారు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించెను" (అపొ.కా. 10:47, 48). ప్రభువు యిచ్చిన ఆజ్ఞలలో ఏదో ఒక దానికి లోబడకుండ ఒకడెట్లు రక్షింపబడగలడు?

2. ఒకడు రక్షింపబడు నిమిత్తము, పాపక్షమాపణ పొందు నిమిత్తము, తన పాపములు కడిగి వేయబడు నిమిత్తము బాప్తిస్మము పొందవలెను. ఒకడు బాప్తిస్మము పొందునపుడేమి జరుగునో తెలియజేయుటకు అనేక భావములు (పదములు) వాడబడెను. అయితే ప్రతి సందర్భములోను దేవుని చిత్తమునకు లోబ డువాడు రక్షింపబడు నిమిత్తము అతడు బాప్తిస్మము పొందినట్లు మనము చూడ

గలము. అపొ. పేతురు ఇట్లు వ్రాసెను: "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించు చున్నది; అదేదనగా శరీరమాలిన్యము తీసివేయుట కాదుగాని యేసుక్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షి నిచ్చు ప్రత్యుత్తరమే"(1 పేతురు 3:21). మరల అతడిట్లనెను: "మీరు మారు మనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపొ.కా. 2:38). అననీయ పౌలుతో యిట్లనెను: "గనుక నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమున బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగి వేసికొనుము" (అపొ.కా. 22:16). ఈ వచనములన్నిటిలోను చివర కలిగే ఫలితము రక్షణ అని నీవు చూడ గలవు. బాప్తిస్మము ఒక్కటి మాత్రమే అవుసరమని ఈ వచనములు చెప్పుట లేదు గాని మరికొన్ని సంగతులతో పాటు బాప్తిస్మము అవుసరమని చెప్పబడుట నీవు గమనించ గలవు. ఇంకొక మాటలో బాప్తిస్మ మొక్కటి మాత్రమే యెవనిని రక్షించదుగాని ఒకడు దేవుని చిత్తమును విని, విశ్వసించి తన పాపముల విషయమై మారుమనస్సు పొంది, క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని బాప్తిస్మము పొందినప్పుడు అతని పాపములు క్షమించబడును, కడిగివేయబడును. దీనిని చేయకుండ యెవడైనను రక్షింపబడగలడను భావము లేఖనములను చదువుటవలన కలుగదు.

3. తిరిగి జన్మించుటకు బాప్తిస్మము అవుసరము గనుక ఒకడు బాప్తిస్మము పొందవలెను. క్రీస్తు యిట్లనెను: "ఒకడు నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడు" (యోహాను 3:5). క్రొత్త జన్మను గూర్చి ప్రభువు నీకొదేముతో సంభాషించు సరికి రాజ్యము లేక సంఘము ఇంకను స్థాపించ బడలేదు, గాని అది త్వరలో స్థాపించబడబోవుచున్నది. అది స్థాపించ బడినప్పుడు దానిలో ప్రవేశించుటకు ఆత్మ మూలముగను నీటి మూలముగను జన్మించుట అవుసరమని ప్రభువు చెప్పెను. మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన వారిని ప్రభువు సంఘములో దినదినము చేర్చుచుండెనని తరువాత మనము కనుగొనగలము (అపొ. కా. 2:38; 2:47). ఇది బాప్తిస్మమును క్రొత్త జన్మతో కలుపుచున్నది. అయితే బాప్తిస్మము క్రొత్త జన్మలో ఒక భాగమెట్లగును? ప్రభువు చెప్పిన దానిని మరల ఒకసారి చూడుము. దేవుని రాజ్యములో ప్రవేశించవలెననిన ఒకడు ఆత్మ మూలముగాను నీటి

మూలముగాను జన్మించవలెనని ఆయన చెప్పెను. ఈ వచనములో నీరు బాప్తిస్మ మును సూచించు చున్నది. ఫిలిప్పు ఐతి యోపీయ నపుసంకునికి నీటిలో బాప్తిస్మ మిచ్చెను (అపొ.కా. 8:36-39). అనగా ఒకడు నీటిలో పాతిపెట్టబడి (కొలస్స 2:21) దానిలో నుండి వెడలివచ్చునపుడు అతడు తిరిగి జన్మించినవాడగును. అయితే ఆత్మ ద్వారా జన్మించుట యనగా నేమిటి? నీటి ద్వారా జన్మించుట ఆత్మ యొక్క నడిపింపును బట్టి అనగా ఆత్మ యొక్క మాటలగు లేఖనము లనుబట్టి జరిగించబడును. ఆ సమ యమందు మన ఆత్మలను జీవింప జేయునట్లు ఆయాత్మ మనలో ప్రవే శించును. తద్వారా మనము పాపములో యున్నప్పుడు మృతులమై యున్నట్లుండక సజీవులుగా చేయబడు దుము. పేతురు ఇట్లనెను: "మీరు సత్యమునకు విధే యులవుట చేత మీ మనస్సులను పవిత్ర పరచుకొనిన వారై యుండి యొకనినొకడు హృదయ పూర్వ కముగాను, మిక్కు టముగాను ప్రేమించుడి" (1 పేతురు 1:23). గనుక లేఖన ముల ప్రకారము బాప్తిస్మము పొందిన వారు తిరిగి జన్మించిన వారు; వారు ప్రభువు కుటుంబ సభ్యులు, ఆయన సంఘ సభ్యులు గాని లేఖనముల ప్రకారము బాప్తిస్మము పొందనివారు తిరిగి జన్మించిన వారు కారు గనుక వారింకను తమ పాపములలోనే యున్నారు.

4. ఒకడు క్రీస్తులోనికి ప్రవేశించుటకు బాప్తిస్మము పొందవలెను. క్రీస్తులోనికి ప్రవేశించుటకు ఒకే ఒక్క మార్గమున్నదని లేఖనములు చెప్పుచున్నవి. అది బాప్తిస్మ మార్గము. బాప్తిస్మ మొక్క దానిని గూర్చియే ఇక్కడ మనము మాటలాడుట లేదుగాని విశ్వాసము, మారుమనస్సు, ఒప్పుకోలుతో కలసియున్న బాప్తిస్మమును గూర్చి మాట్లా డుచున్నాము. ప్రభువు బోధనుబట్టి యున్న బాప్తిస్మమును గూర్చి, ఒకని ఈ లోకము నుండి క్రీస్తులోనికి ప్రవేశింపజేయు ఆఖరి మెట్టగు దానిని గూర్చి మనము మాట్లాడు చున్నాము. ఈ బాప్తిస్మము ఒకని క్రీస్తు లోనికి ప్రవేశపెట్టును. క్రీస్తులోనికి ప్రవేశించు వేరొక మార్గము ఏదియును లేదు. పౌలు ఇట్లు వ్రాసెను: "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:26, 27). "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?" యని అతడు మరల వ్రాసెను (రోమా 6:3). "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింథీ 5:17).

ఒకడు క్రీస్తులో ఉన్న యెడల అతడు నూతన సృష్టియని నీవు ఇక్కడ గమనించగలవు. అయితే ఒకడు నూతనసృష్టి యెట్లగును? ఇది ఇంతకు ముందు యోహాను 3:5లో చదివినట్టి క్రొత్త జన్మలో సంభవించును. ఇదంతయు బాప్తిస్మము ద్వారా సంభవించునని మనస్సు నందుంచుకొనుము. యెవడైనను బాప్తిస్మము లేకయే రక్షింపబడితినని చెప్పుకొనుచుండిన యెడల, అతడు క్రీస్తునకు వెలుపల క్రీస్తు లేకయే రక్షింపబడితినని చెప్పుకొనుచున్నాడు. ఏలయనగా క్రీస్తులోనికి ప్రవేశించుటకు ఒకడు బాప్తిస్మము పొందవలెనని బైబిలు బోధించుచున్నది. క్రీస్తులో రక్షణ యున్న యెడల ఆయనకు వెలుపల రక్షణ లేదనునది తేటగా యున్నది. యిది మరల బాప్తిస్మము యొక్క ప్రాముఖ్యతను మనకు చూపించుచున్నది.

5. ఒకడు సంఘములో ప్రవేశించుటకు బాప్తిస్మము పొందవలెను. అపొ.పౌలు ఇట్లనెను : "మన మందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి" (1 కొరింథి 12:13). మన మందరము ఒక్క శరీరములోనికి బాప్తిస్మము పొందితిమని ఈ లేఖకుడు చెప్పుచున్న దానిని గమనించుము. అయితే ఆ శరీర మేమిటి? ఆ శరీరము సంఘము. ఒకే ఒక్క శరీరమున్నదని అదే లేఖకుడు చెప్పుచున్నాడు (ఎఫెసీ 4:4). ఆ శరీరమే సంఘము (కొలస్స 1:18) లేక సంఘమే ఆ శరీరము (ఎఫెసీ 1:22, 23). 1 కొరింథీ 12వ అధ్యాయములో శరీరమును గూర్చి అతడనేక సార్లు వ్రాసెను గాని 12:27లో అతడు క్రీస్తు శరీరమును గూర్చి వ్రాసెను. శరీరమే సంఘమై యున్న యెడల అతడు క్రీస్తు సంఘమును గూర్చి మాట్లాడుచున్నాడు. అయితే ఒకడు సంఘములోనికెట్లు ప్రవేశించును? మార్కు 16:16లో నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని క్రీస్తు చెప్పెను. మరియు అపొ.కా. 2:47లో ఈ రక్షింపబడిన వారిని ప్రభువు తన సంఘముతో చేర్చుచుండెనని కనబడుచున్నది. మనము ఒకే ఆత్మ ద్వారా ఒకే శరీరములోనికి బాప్తిస్మము పొందితిమని పౌలు చెప్పెను. పరిశుద్ధాత్ముడు మనకు వాక్యమును అనగా క్రొత్త నిబంధనను యిచ్చెను గనుక, మనమా వాక్యమునకు లోబడినప్పుడు, ఆత్మ యిచ్చిన నడిపింపును బట్టి మనము ఒకే సంఘములోనికి బాప్తిస్మము పొందితిమి. ఎవరైతే ప్రభువు చిత్తమునకు లోబడి వాక్యప్రకారము బాప్తిస్మము పొందారో వారు ప్రభువు సంఘ సభ్యులు, యెవరు దానిని జరిగించుటకు నిరాకరింతురో వారు క్రీస్తుకు ఆయన సంఘమునకు వెలుపలయుండి నశింతురు. ఒకడు దేవుని వాక్యమును బట్టి నడిపించ బడగోరుచున్న యెడల అతడు గ్రహించుకొను సంగతి

యిదే.

బాప్తిస్మము పొందుటకు యింకా అనేక కారణములను చూపించవచ్చును. అయితే బాప్తిస్మము అవసరమని అది రక్షింపబడు కవసరమని నమ్మకము కలుగ జేయుటకు సరిపడినంత ఈ వాక్యములో చెప్పబడి యున్నది. ఒకడు ప్రభువునకు లోబడకుండ తాను రక్షింపబడితినని, క్రీస్తునందున్నానని, ఆయన సంఘమందున్నానని యెట్లు చెప్పగలడు? ఈ సంగతులు అట్లున్నవో లేవో యని తెలిసికొనుటకు నీవు దేవుని వాక్యమును పరిశోధించి కనుగొనుము. నీవట్లు చేసి, ఈ యంశముపై దేవుని కోరికను గ్రహించుకొనినప్పుడు ఆయన చెప్పిన రీతిగ నీవు తప్పకుండ బాప్తిస్మము పొందెదవు.

# అనేక సంఘములు

(Too many Churches)

ఒక వూరిలో ఒక మనుష్యుడు క్రైస్తవ్యములో ఒక సంగతి అతనిని బాధపెట్టుచున్నట్లు నాకొకసారి చెప్పాడు. "ఎందువలన అనేక సంఘములున్నవి?" యని అతడు నన్నడిగెను.

ఈ ప్రశ్నను నీ వెన్నడయినా ఆలోచించావా? ఈ సంఘములన్నియు దేవునికి ఇష్టపూర్వకమైనవా యని నీవెన్నడయిన అడిగావా? డినామినేషనులు బైబిలు అధికారమును పొంది యున్న వాయని నీవెన్నడయినా ఆలోచించావా? డినామినేషనులు ఎక్కడినుండి వచ్చినవి? అవన్నియును సరియైనవయితే బైబిలు కూడ సత్యమా? మనము ఈ జీవితాన్ని ఒక్కసారి మాత్రమే సాగించగలము గనుక ఈ ప్రశ్నలకు సరియైన జవాబును కనుగొని సత్యమందు మనము నిలిచి యుండవలెను.

## ఐక్యత అవసరము

"మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు, తండ్రీ, నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున వారును మనయందు ఏకమై యుండవలెన వారి కొరకు మాత్రము నేను ప్రార్థించుట లేదు; వారి వాక్యము వలన నా యందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని వారి కొరకును ప్రార్థించుచున్నాను" (యోహాను 17:20, 21).

క్రీస్తుకును ఆయన తండ్రికినిగల ఏకత్వమును క్రీస్తు యొక్క అనుచరులు

కలిగియుండవలెను. మనము పాలన పద్ధతిలోను, బోధలోను, ఆరాధనలోను ఏకమై యుండవలెనని ఆయన ప్రార్ధనను బట్టి మనము గ్రహించుకొనగలము. డినామినేషన్ల వలె విభజింపబడిపోవుట క్రీస్తు ప్రార్ధనకు వ్యతిరేకముగ యుండుటయే.

"సహోదరులారా, మీరందరు ఏక భావముతో మాటలాడవలెననియు, మీలో కక్షలు లేక యేకమనస్సుతోను ఏక తాత్పర్యముతోను, మీరు సన్నద్ధులై యుండవలెననియు మన ప్రభువైన యేసు క్రీస్తు పేరట మిమ్మును వేడుకొనుచున్నాను" (1 కొరింథీ 1:10). కొరింథులో సంఘము చీలికలాయెను. గాని అది దేవుని అనుమతి బడయలేదు. అందువలన వారు ఏకభావముతో మాటలాడవలెననియు, విభజనలకు స్వస్తి చెప్పవలెననియు వారికి బోధింపబడెను. "సహోదరులు ఐక్యతకలిగి నివసించుట ఎంత మేలు! ఎంత మనోహరము!" (కీర్తన 133:1).

## ఒకే ఒక్క సంఘము

"నా సంఘమును కట్టుదును" అని యేసు చెప్పెను (మత్తయి 16:18). అపొస్తలుల కార్యములు అను పుస్తకమును లూకా వ్రాయుసరికి ఒకే ఒక్క సంఘము ఉండెను. "మరియు రక్షింపబడుచున్న ప్రతివారిని ప్రభువు ప్రతిదినము సంఘముతో చేర్చుచుండెను" (అపొ.కా. 2:47). ప్రభువు కట్టుదునని చెప్పిన సంఘమే అప్పటికి నిలిచియుండెను. అది క్రీస్తు సంఘము. ఆదిలో ఒకేఒక్క సంఘముండెను గనుక ఒకడు చేర్చబడు నిమిత్తము మరొక సంఘ మేమియు లేదు.

## సత్యము నుండి తొలగిపోవుట

ప్రభువు యొక్క స్వంత చిత్తమును బట్టి క్రీస్తు సంఘము స్థాపించ బడెను. అది ఆయన నామమును ధరించెను, దైవానుమతి బడసిన ఆరాధన క్రమము ననుసరించెను, దేవుడేర్పరచిన పాలనపద్ధతిని కలిగి యుండెను మరియు పాపులకు దేవుని రక్షణ సంకల్పమును బోధించెను. అయితే కొద్ది కాలములోనే దేవుని సంకల్పమునకు బదులు మానవ కల్పితములనుంచుట ద్వారా సంఘము సత్యము నుండి తొలగి పోయెను.

"అయితే కడవరి దినములలో కొందరు.......విశ్వాసభ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు" (1 తిమో 4:1). "నేను వెళ్లిపోయిన తరువాత కూ్రమైన తోడేళ్ళు మీలో ప్రవేశించునని నాకు తెలియును; వారు మందను కనికరింపరు" (అపొ.కా. 20:29).

ఈ దోషముల ఫలితముగా భ్రష్టత్వములో పడిపోయిన సంఘము ఒకటి రోమా

పట్టణమునకు కేంద్రముగా చేసికొనెను. క్రీ॥శ॥ 1500 లో మార్టిన్ లూథరుతో ఆరంభమయిన ప్రొటెస్టాంట్ సవరణోద్యమము డినామినేషనులకు ఆరంభమాయెను. వారిలో కొందరు కొన్ని తప్పులను సవరించిరి గాని అన్ని విషయములలోను ఆదిలో ఈయబడిన దేవుని నమూనా యొద్దకు లేక ప్రణాళిక యొద్దకు తిరిగి రాలేకపోయిరి. వారనుసరించిన మానవ కల్పిత నామములు, సిద్ధాంతములు, ఆరాధనలు, ఆచారములను వారు వీడి వాటికి బదులుగా దేవుని నామము, బోధలు, ఆరాధనాచారములను వారు మొదలిడవలెను. బైబిలులో కనబడని నామము, సిద్ధాంతములనువీడి, బైబిలులో కనబడని మరొక నామమును సిద్ధాంతమును అనుసరించుటలో కలిగే ప్రయోజన మేమిటి?

## పునరుద్ధరణ అవుసరము

విభజనలు దేవుని కిష్టమైనవికావు. ఏలయనగా అందరు ఒకే నియమము చొప్పున క్రమముగా నడుచుకొనవలెను (ఫిలిప్పీ 3:16). యేసు ఒకే ఒక్క సంఘమును స్థాపించెను. దేవుడు ఒకే ఒక్క సంఘమునకు అనుమతి యిచ్చెను. దేవుని వాక్యముపై ఆధారపడిన ఏకత్వము కొరకు బైబిలు ఇంకను విజ్ఞాపన చేయుచున్నది.

మనము క్రీస్తు సంఘమును పునరుద్ధరించవలెను. దీనిని మనమెట్లు సాధించగలము? సంఘము కొరకు ఆదిలో ఈయబడిన దేవుని ప్రణాళికకు వెళ్ళి దేవుని నమూనాను అనుసరించుటద్వారా దీనిని సాధించగలము. మనము బైబిలు నామమును ధరింతుము, బైబిలు ననుసరింతుము, బైబిలు ఆరాధన ననుసరింతుము. మరియు పాపులకు బైబిలు రక్షణ సంకల్పమును బోధింతుము. ఈ విధముగా మాత్రమే మనము క్రీస్తు సంఘముగా యుండగలము.

## మీకు మా విజ్ఞాపన

మీరు ప్రతి డినామినేషన్‌ను విడిచిపెట్టండి; బైబిలులో బోధించబడని ప్రతి నామమును, బోధను ప్రక్కకు త్రోసిపుచ్చండి. క్రీస్తు సంఘ సభ్యులు కండి. సంఘములో నమ్మకముగా యుండండి. మీరు క్రైస్తవ జీవితమును జీవించిన తరువాత రక్షింపబడిన వారందరితో పరలోకములో యుండుటకు మీకు అవకాశము దొరుకును. యేసు మిమ్ములను రక్షించ గోరుచున్నాడు, గాని మీరాయన సంఘములో యుండవలెను. ఏలయనగా ఆయనే సంఘమయిన ఆ శరీరమునకు రక్షకుడు (ఎఫెసీ 5:23).

మూ - ఆల్బర్ట్ గార్డనర్

# విశ్వాసము

(Faith)

విశ్వాసమనునది నమ్మకము, రాజభక్తి మొదలగు వాటికి సంబంధించినది. యేసు క్రీస్తులో ప్రేమ వలన విశ్వాసము కార్యసాధన మగునని పౌలు చెప్పెను (గలతీ 5:6). విశ్వాసము లేకుండా దేవునికిష్టుడై యుండుట అసాధ్యము (హెబ్రీ 11:6). అయితే ప్రేమ లేని విశ్వాసము నిష్ప్రయోజనము (1 కొరింధి 13). క్రియలులేని విశ్వాసము మృతము (యాకోబు 2:26). అందువలన మానవ జీవితంలో విశ్వాసము ఒక జీవ నది వంటిది. విశ్వాసము రక్షించును, హెచ్చరించును, ఖండించును, తప్పుదిద్దును, విశ్వాసము మనలను క్రీస్తులో పరిపూర్ణులుగా చేయును.

దేవుని విశ్వాసము వలన మానవ హృదయం పవిత్ర పరచబడెను (అపొ. కా. 15:9). విశ్వాసము వలన ప్రజలు తమ పావముల విషయమై మారు మనస్సునొంది పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 2:38). విశ్వాసము వలన మానవులు పరిశుద్ధ పరచబడదురు (అపొ.కా. 26:18). ప్రపంచ జనాంగములన్నియు విశ్వాసమునకు విధేయులగునట్లు సువార్త ప్రకటింపబడు చున్నది (రోమా 1:15). విశ్వాస మూలమున నీతిమంతులుగా తీర్చబడిన తరువాత మనకు దేవునితో సమాధాన మేర్పడును (రోమా 5:1).

ఒకే ఒక్క విశ్వాసమున్నది (ఎఫెసీ 4:5). ఆ విశ్వాసము పరిరక్షింపబడాలి. క్రైస్తవులు విశ్వాసమను డాలుతో తమ్మును తాము సంరక్షించుకోవాలి (ఎఫెసీ 6:16). క్రైస్తవులు విశ్వాసము నందు అభివృద్ధి చెందాలి (ఫిలిప్పి 1:25). పౌలు ఇట్లు చెప్పుచున్నాడు: "పునాది మీద కట్టబడిన వారై స్థిరముగా ఉండి, మీరు విన్నట్టియు, ఆకాశము క్రింద ఉన్న సమస్త సృష్టికి ప్రకటింపబడినట్టియు ఈ సువార్త వలన కలుగు నిరీక్షణ నుండి తొలగిపోక విశ్వాసమందు నిలిచి యుండిన యెడల ఇది మీకు కలుగును" (కొలస్స 1:23). క్రైస్తవులు స్థిర విశ్వాసమును కనబరతురు (కొలస్స 2:25). థెస్సలోనికయలో యున్న సహోదరులు విశ్వాసముతో కూడిన పనిని, ప్రేమతో కూడిన పరిచర్యను పౌలు జ్ఞాపకం చేసికొనెను (1 థెస్స 1:3). క్రైస్తవుని విశ్వాసము పరిరక్షింపబడాలి. అందువలన అపవాది తంత్రములను ఎదిరించునట్లు మనం దేవుని స్వరాంగ కవచమును ధరించుకోవాలని చెప్పబడింది. సత్యము, నీతి, శాంతి సువార్త, విశ్వాసము, రక్షణ, దేవుని వాక్యము, ప్రార్థన - యివి అపవాదిపై మనం ఉపయోగింప వలసిన అస్త్రములు. వాటిని మనం ఎల్లవేళలా ఉపయోగిస్తూనే యుండాలి (ఎఫెసీ 6:10-18).

✍ - హన్స్ జె. డేర్‌షక్.

# రెండవ మరణము

(The Second Death)

"ఒకడు నామాట గైకొనిన యెడల వాడెన్నడును మరణము పొందదడు" యని క్రీస్తు బోధించెను (యోహాను 8:51). మీరేల నా మాటలు గ్రహింపకున్నారు? మీరు నా మాట విననేరకుండుట వలననే గదా? మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు; మీ తండ్రి దురాశలు నెవేర్చగోరుచున్నారు. ఆదినుండి వాడు నరహంతకుడై యుండి సత్యమందు నిలిచినవాడు కాడు; వానియందు సత్యమే లేదు; వాడు అబద్ధమాడునప్పుడు తన స్వ భావము ననుసరించియే మాట లాడును; వాడు అబద్ధికుడును, అబద్ధమునకు జన కుడునై యున్నాడు (యోహాను 8:43, 44). క్రీస్తు మాటకు లోబడువాడు మరణ ములో నుండి తప్పింపబడి జీవము మును పొందును. శారీరక మరణమును గూర్చి కాదుగాని ఆత్మీయ మరణమును గూర్చి క్రీస్తు మాట్లాడుచున్నట్లు మనకు విదితమే.

అట్లయితే ఒకడు ఈ ఆత్మీయ మరణోగ్రతకు ఎట్లు గురియౌను? "పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమించును; ఆజ్ఞాతి క్రమమే పాపము" (1 యోహాను 3:4). గనుక ప్రభువు మాటలను అతిక్రమించు ప్రతి వాడును మరణము నొందును. "పాపము చేయని వాడు ఒకడును లేడు" (1 రాజులు 8:46). "పాపము చేయక మేలు చేయు చుండు నీతిమంతుడు భూమిమీద ఒకడైనను లేడు" (ప్రసంగి 7:20). "ప్రతివాడు నడినెత్తిని వ్యాధి కలిగి యున్నాడు" (యెషయా 1:5). నేను దేశమును పాడు చేయకుండునట్లు ప్రాకారమును దిట్ట పరచుటకును, బద్దలైన సందులలో నిలు చుటకును తగిన 'వాడెవడని' నేను ఎంత విచారించినను ఒకడైనను నాకు కనబడలేదు (యెహెజ్కేలు 22:30). యెరూషలేము వీధులలో అటు యిటు పరుగెత్తుచు చూచి తెలిసికొనుడి; దాని రాజవీధులలో విచారణ చేయుడి; న్యాయము జరిగించుచు నమ్మ కముగా యుండ యత్నించుచున్న 'ఒకడు' నాకు కనబడిన యెడల నేను వానిని క్షమిం చుదును (యిర్మియా 5:1). భక్తుడు "దేశములో లేకపోయెను, జనులలో యధా ర్ధపరుడు ఒకడును లేడు, అందరును ప్రాణహాని చేయుటకై పొంచి యుండువారే. ప్రతి మనుష్యుడు కిరాతకుడై తన సహో దరుని కొరకు వలలు ఒగ్గును" (మీకా 7:2). నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు

(రోమా 3:11). అందరును పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు (రోమా 3:23). అందు వలననే "పాపములను తీసివేయుటకు క్రీస్తు ప్రత్యక్ష మాయెను" (1 యోహాను 3:5). అందువలన వలననే మరణవిముక్తి కలుగును.

పాపము చేయువాడెవడో వాడే మరణము నొందును (యెహెజ్కేలు 18:4). కుమారుల దోషమునుబట్టి తండ్రులకు మరణశిక్ష విధింపకూడదు. ఎవని పాపము నిమిత్తము వాడే మరణశిక్ష నొందును (ద్వితీ 24:16). మొదటి నిబంధన కాలములో పాపము చేసినవారు మరణశిక్షకు పాత్రులై యుండేవారు. అట్టివారిని రాళ్ళతో కొట్టిగాని, శిరచ్ఛేదన చేయుటవలన గాని, అగ్నిలో దహించుట చేతగాని, మ్రానుపై వ్రేలాడదీయుట వలన గాని ఆదోషమునకు శిక్ష విధించి చంపెడివారు. ఆ చట్టము భౌతికముగా చంపుట మాత్రమేగాక ఆత్మీయ మరణమునకు వారిని అప్పగించెడిది.

గాని నేటి క్రొత్త చట్టము ఏ మానవుని కూడా భౌతికముగా చంపుటకు అనుమతి నిచ్చుట లేదు. "పాపమువలన వచ్చు జీతము మరణము" (రోమా 6:23). "ఆయన ప్రతివానికిని వానివాని క్రియల చొప్పున ప్రతిఫలమిచ్చును" (రోమా 2:6). ఇదిగో నేను త్వరగా వచ్చుచున్నాను. వాని వాని క్రియల చొప్పుల ప్రతివాని కిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నా యొద్ద ఉన్నది (ప్రకటన 22:12). నేడు మనము పాపము చేసినచో ఆ దోషమునకు శిక్ష శీఘ్రముగా రాక పోయినను దాని యొక్క జీతము మాత్రము మన కొరకు వేచి యుండును. "కొందరి పాపములు తేటగా బయలుపడి న్యాయపు తీర్పునకు ముందుగా నడుచు చున్నవి. మరికొందరి పాపముల వారివెంట వెళ్లుచున్నవి" (1 తిమోతి 5:23).

పిరికివారును, అవిశ్వాసులును (క్రైస్తవులు కానివారు, క్రైస్తవులై విశ్వాస భ్రష్టులైనవారు), అబద్ధికులందరును (అబద్ధములాడువారు, అబద్ధబోధలు చేయువారు) అగ్ని గంధకములతో మండు గుండములో పాలు పొందుదురు; ఇది రెండవ మరణము (ప్రకటన 21:8; 22:15). నరకములో పాలు పొందువారి జాబితాను మనము గమనించి నట్లైతే, పాపములో హెచ్చుతగ్గులు లేవనియు, అబద్ధికుడును నరహంతకుడును నరకమునకు పాత్రులేననియు తెలిసికొన గల్గుచున్నాము. పాపము వలన వచ్చు ఈ జీతము మరణము. ఇది దేవునికిని పాపికిని మధ్య కలుగు నిత్యమైన వియోగము.

"నీతిమంతుడే రక్షింపబడుట

దుర్లభమైతే భక్తిహీనుడును, పాపియు ఎక్కడ నిలుతురు?" (1 పేతురు 4:18). పాపము చేయుచు యుండువాడే పాపి. ఒకడు రక్షింపబడిన తరువాత పరిశుద్ధ తను సంపూర్తి చేసికొనుటకు మానివేసి, పాపసంబంధమైన క్రియలనే చేయు చున్నట్లయితే అతడు పాపిగా యెంచ బడును. "అమూల్యమైన రక్తము చేత అనగా నిర్దోషమును నిష్కలంకమునగు గొఱ్ఱె పిల్లవంటి క్రీస్తు రక్తము చేత, విమోచింప బడితిరని మీ రెరుగుదురు గదా?" (1 పేతురు 1:19). గనుక ప్రతి నిజ క్రైస్తవుడు పరిశుద్ధుడని పిలువబడెను (2 కొరింథీ 9:1). "నేను పరిశుద్ధుడనై యున్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండుడని వ్రాయబడి యున్నది. కాగా తన పాపమునకు ప్రాయశ్చిత్తము నొందిన వాడు ధన్యుడు. ప్రభువు చేత నిర్దోషియని ఎంచబడిన వాడు ధన్యుడు" (రోమా 4:7, 8). ఆ పూర్వపు పాపమంతయు కొట్టివేయబడి యిక వానిపై నిలిచి యుండదు. గనుక అది మరణకరముగాని పాపముగా పరిగ ణింపబడదు.

"మీలో ఎవడైనను దేవుని కృపను పొందకుండ తప్పిపోవునేమో అనియు, చేదైన వేరు ఏదైనను మొలచి కలవర పరచుట వలన అనేకులు అపవిత్రులై పోవుదురేమో అనియు, ఒక పూట కొరకు తన జ్యేష్ఠత్వపు హక్కును అమ్మివేసిన ఏశావు వంటి భ్రష్టుడైనను వ్యభిచారియైనను ఉండు నేమో అనియు జాగ్రత్తగా చూచు కొనుడి" (హెబ్రీ 12:15, 16). సహో దరులారా, జీవము గల దేవుని విడిచి పోవునట్టి విశ్వాసములేని దుష్టహృదయము మీలో ఎవనియందైనను ఒక వేళ ఉండునేమో అని జాగ్రత్తగా చూచు కొనుడి. పాపము వలన కలుగు భ్రమ చేత మీలో ఎవడును కఠినపరచబడకుండునట్లు నేడు అనబడు సమయముండగానే, ప్రతిదినము ఒకని కొకడు బుద్ధి చెప్పుకొనుడి (హెబ్రీ 3:21-15). మీరు శరీరానుసారముగా ప్రవర్తించిన యెడల చావవలసినవారై యుందురుగాని ఆత్మచేత శారీరక క్రియలను చంపిన యెడల జీవించెదరు (రోమా 8:13).

"క్రీస్తు యేసునందున్న వారికి ఏ శిక్షావిధియు లేదు" (రోమా 8:1). అట్టి వారికి రెండవ మరణముపై విజయము కలుగును. రెండవ మరణము జయింపగోరి, దేవునితో నిత్యము నివసింపగోరుచున్నావా? అట్లయితే నేడే ఆయన యందు జీవించుటకు నిర్ణయించుకొనుము. అప్పుడు నీ ఆత్మ నీతి విషయమై జీవము కలిగి యుండును.

# యేసు క్రీస్తు దేవుని కుమారుడు

(Jesus Christ, The Son of God)

యేసు క్రీస్తు సత్పురుషుడే గాని దేవుని కుమారుడుకాదని కొందరన్నారు. ఆయన సత్పురుషుడని వారేల చెబుతారు? క్రొత్త నిబంధన ఆయనను గూర్చి ఏమి చెప్పుచున్నదో దానిని బట్టి వారట్లంటారు. ఆయన పరలోకము నుండి వచ్చినట్లును తాను దేవుని కుమారుడయినట్లును యేసు చెప్పినట్లు అదే క్రొత్త నిబంధన చెప్పు చున్నది. తనను గూర్చి ఆయన చెప్పు కొనినది యదార్థం కాకపోతే ఆయన మంచి వాడెట్లవుతాడు? మంచి వాడెప్పుడు తనను గూర్చి బొంకడుకదా?

క్రైస్తవులు దేవుని వాక్యమువలన జనింపజేయబడిన వారు కనుక దేవుని పిల్లలు (యాకోబు 1:18). గాని యేసు ఒక్కడే దేవుని వలన జన్మించినవాడు. పరిశుద్ధాత్మని శక్తి వలన ఆయన తల్లి కన్యయైన మరియ గర్భముధరించి ఆయనకు జననము నిచ్చింది.

యేసు క్రీస్తు దేవుని కుమారుడు, మానవుల రక్షకుడు మానవులందరి రక్షణ కొరకు ఆయన రోమీయుల సిలువ పై మరణించెను. మూడు దినముల అనంతరం ఆయన తండ్రియైన దేవుడు మన సమాధానార్థము ఆయనను మృతులలో నుండి లేపెను (రోమా 4:24, లూకా 24:46-47, 1 కొరింథీ 15:1-3). యేసు మానవులందరి కొరు మరణించెను. కనుక అందరు రక్షింపబడుదురని మనంతలంచ నక్కర్లేదు. యేసునందునమ్మిక కలవారు మాత్రమే రక్షింపబడుదురు. ఆయన యందు నమ్మిక యుంచుట అంటే ఆయన సువార్తను విశ్వసించుట, పాపముల విషయమై మారు మనసు పొందుట ఆయన యందున్న నీ విశ్వాసమును ఒప్పుకొనుట, మరియు పాప క్షమాపణ నిమిత్తము నీటిలో ముంచబడి తిరిగి లేచుటయగును (యోహాను 8:21-24; రోమా 10:9-10; 6:3-4; కొలస్సీ 2:12).

తనను గూర్చిన సువార్తను నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడునని యేసు చెప్పెను (మార్కు 16:15-16). క్రీస్తు నందలి విశ్వాసులు మారుమనసు పొంది పాప క్షమాపణ నిమిత్తము క్రీస్తునామమున బాప్తిస్మము పొందవలెనని పేతురు హెచ్చరించెను (అపొ.కా. 2:38). అట్లు చేయువారిని ప్రభువు తన సంఘముతో చేర్చుకొనును (అపొ.కా. 2:47). ఈ విషయంలో సహాయం కొరకు మీకు సమీపముగానున్న క్రీస్తు సంఘమును దర్శించండి.

తెలుగు - బేసిల్ ఒవర్టన్

గమనిక : సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

SATYA VANI, P.O. BOX-80, KAKINADA - 533 001.

# HEAR THE VOICE OF TRUTH ON RADIO SRILANKA

| | | |
|---|---|---|
| TELUGU | : | Sunday, Monday, Wednesday & Thursday, 2:00 P.M.-2:15 P.M. |
| T.V. | : | Every Saturday 6:30 A.M. on Teja Channel & Every Tuesday 6:30 A.M. MAA - Channel. *Speaker : Joshua Gootam,* P.O.Box-80, Kakinada - 533 001. |
| HINDI | : | Sunday 6:45 p.m. 7:00 p.m. and Thursday, 6:45 p.m. 7:00 p.m. Speaker, *Sunny David*, P.O.Box 3815, New Delhi - 110 049. |
| Tv | : | Every Sunday at 6:00 A.M. - ETC Channel |
| TAMIL | : | Monday, Tuesday, Wednesday, Thursday, Friday 5:30 p.m. to 5:45 p.m. Speaker : *P.R.Swamy,* P.O. Box-8405, Bangalore-560084. |
| MALAYALAM | : | Friday, 3:45 p.m. 4:00 p.m. Speaker : *P.K.Varghese,* P.O. Box - 5540 Trivendrum - 695043 (Kerala). |
| PAITE | : | Sunday 8:00 p.m. Speaker, *Kamlianpao,* P.O.Box-56, Churachandpur, Manipur-795128. |

Please write to these addresses for Bible correspondence courses, magazines, and other Christian literature in your language.

ALL OF THESE PROGRAMMES ARE SPONSORED BY CHURCHES OF CHRIST.

## "సత్యవాక్కు"

సత్యవాక్కు మాసపత్రిక ప్రతినెలా అనేక వేల గృహములను దర్శించు చున్నది. మరియు అనేక మంది ప్రతినెలా మాసపత్రికను కోరుచున్నారు. అట్టివారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా పంపించ వలెను. లేనియెడల సత్యవాక్కు పత్రిక పంపబడదు. మీకు సత్యవాక్కు క్రమముగా అందుచున్న యెడల మీ చందాను వెంటనే పంపండి. సత్యవాక్కు పత్రిక కాపీలు ఒకటికంటె ఎక్కువ మీకు అందుచున్న యెడల వాటి వివరాలు మాకు తెలియజేయండి.

– 'ఎడిటర్'

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:
SATYA VAKKU
P.O. Box 80,
Kakinada - 533 001

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.